# ప్రజల మానిఫెస్టో

(2023 తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు)




- ప్రజల ద్వార
- ప్రజల యొక్క
- ప్రజల కొరకు

# ప్రజల మానిఫెస్టో
## (2023 తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు)

ఎన్నికల సందర్భంలో రాజకీయ పార్టీలు వారు చేయబోయే పనుల గురించి మానిఫెస్టో విడుదల చేయడం ఆనవాయితీ. తెలంగాణ ఎన్నికల సందర్భంలో రాజకీయపార్టీలు పోటా పోటీగా సంక్షేమ పథకాల పేర రకరకాల వాగ్దానాలు చేస్తున్నాయి. వారు చేస్తున్న వాగ్దానాల ఖరీదు రాష్ట్ర బడ్జెట్‌కు ఐదింతలు ఉంటుంది. ఈవిధంగా చేసే పోటాపోటీ వాగ్దానాలు ప్రభుత్వ ధనంతో ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమంగా చూడాలి. విచ్చలవిడిగా సంక్షేమపథకాల పేర ప్రభుత్వ ధనాన్ని ఖర్చుచేసి దివాళా తీసిన దేశాలు చాలా ఉన్నాయి. దురదృష్టవశాత్తు అధికారమే పరమావధిగా భావించే అల్పబుద్ధి రాజకీయ పార్టీలకు ఇవి ఏమీ కనిపించడంలేదు. ఏ రాజకీయ పార్టీ అయినా తమ మానిఫెస్టోలో దీర్ఘకాలిక అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ నిరుపేదలకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలుపరచాలి. పార్టీలు సమాజం మేలు మరిచి ఓటరును దృష్టిలో ఉంచుకొని మానిఫెస్టో తయారుచేస్తున్నాయి. ఈ విషయాలను పరిశీలించి అన్ని రంగాల వారితో చర్చించి ప్రజలకు అవసరమైన వాటికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల మానిఫెస్టో విడుదల చేస్తున్నాము.

### 1. రాష్ట్ర బడ్జెట్‌లో విద్య మరియు ఆరోగ్యానికి 25% కేటాయించాలి :

**విద్య :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యపై బడ్జెట్‌లో కేటాయింపులు 10% నుంచి 6% కి తగ్గినాయి. ఈ బడ్జెట్ కేటాయింపు ఉపాధ్యాయుల జీతభత్యాలకే సరిపోతుంది. రాష్ట్రంలో చాలా బడులు ఎటువంటి మరమత్తులు లేక శిధిలావస్థలో ఉన్నాయి. చాలా చోట్ల మంచి నీటి సదుపాయం కాని, మరుగుదొడ్లు కాని లేవు.




**ఆరోగ్యం :** డాక్టర్ల మరియు ఇతర పారమెడికల్ సిబ్బంది కొరతతో దవాఖానాలో సరియైన సేవలు అందటం లేదు. దీనితో సామాన్యులు కూడ ప్రైవేటు ఆసుపత్రి వైపు మొగ్గు చూపుతున్నారు.

### 2. నాణ్యమైన విద్య మరియు వైద్యం అందించడానికి శాఖాపరంగా మార్పులు :

రాజ్యాంగ అనుకరణ 171 (3) (సి) ప్రకారము రాష్ట్ర శాసన మండలిలో మొత్తము సీట్లలో 1/12 వంతు (ఒన్ ట్వల్త్) సీట్లు ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ఎంపిక కావాలి. ఆ లెక్కన తెలంగాణ రాష్ట్రంలో ఐదుగురు (ఎమ్.ఎల్.సి.లు) శాసనమండలిలో సభ్యులుగా ఉంటారు. వీరు విద్య గురించి అలాగే ఉపాధ్యాయుల సమస్యల



గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేస్తారు. ఇది ఇలా ఉండగా మరల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్రంలో 53 ఉపాధ్యాయ యూనియన్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని గుర్తింపు పొందినవి కాగా మిగిలినవి గుర్తింపులేనివి. యూనియన్ పని పేరు చెప్పి ఈ సంఘాల ఆఫీసు బేరర్లు బడికి రావడం కాని పాఠాలు చెప్పడం కాని చేయడం లేదు. దీనితో సర్కారు బడులలో విద్య అద్వాన్నంగా తయారైంది. సర్కారు మాస్టార్లు ప్రైవేటు మాస్టార్ల కంటే అధిక విద్యార్హతలు ఉండి అధిక మొత్తంలో జీతభత్యాలు తీసుకుంటున్నా సర్కారీ బడిలో విద్యా ప్రమాణాలు మాత్రము నానాటికీ దిగజారుతున్నాయి. పేద ప్రజలు కూడ అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటుబడుల లోనే తమ పిల్లలను చదివించడానికి ఇష్టపడుతున్నారు.

ఇక వైద్య ఆరోగ్యశాఖలో కూడ యూనియన్‌ల గొడవతో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు సరియైన సేవలు అందకపోవడం, లంచాల తాకిడితో ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పోయింది.

విద్య, వైద్యం ఈ రెండు శాఖలలో పూర్తిగా ప్రక్షాళన జరిగి పనితీరు మెరుగుపరచవలసిన అవసరమెంతైనా ఉంది.

## 3. సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో 30% మించకుండా కేటాయింపు :

సంక్షేమపథకమన్నది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. దూరదృష్టి లోపించిన రాజకీయ నాయకులు విద్య , వైద్యం, మౌలికరంగాల అభివృద్ధి, ఉపాధికల్పన వంటి వాటిని పక్కన పెట్టి ఓటర్లను ప్రలోభపెడుతూ, రకరకాల సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారు.

## 4. గ్రామ పంచాయితీలు మరియు మునిసిపాలిటీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం సూచించినట్లు వారికి చెందవలసిన నిధులు క్రమం తప్పకుండా విడుదల చేయుట :

భారత రాజ్యాంగం అనుకరణ 243 – ఐ ప్రకారము రాష్ట్రంలో రాష్ట్ర ఆర్థికసంఘం ఏర్పాటు కావాలి. వీరు పంచాయితీలు మరియు మునిసిపాలిటీల ఆర్థిక స్థితిగతులను పరిశీలించి రాష్ట్ర ఖజానాలో పన్నుల రూపంలో వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మరియు పంచాయితీలు, మునిసిపాలిటీల మధ్య పంపకం చేస్తారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థిక సంఘం సూచనలు, సలహాలు పక్కన పెట్టి వారికి తోచిన విధంగా అప్పుడప్పుడు కొన్ని నిధులు దయతలచి ఇస్తున్నట్లుగా ఉంది. కేంద్ర నిధులు క్రమం తప్పకుండా పంచాయితీలకు అందుతున్నా రాష్ట్ర నిధులు మాత్రము అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనితో చాలా గ్రామపంచాతీలలో నిధుల కొరతతో ఏమీ చేయలేకపోతున్నారు. హైదరాబాదు నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితి ఇందుకు ఉదాహరణ.

## 5. పెట్రోలు, డీజిల్‌పై ట్యాక్సుల తగ్గింపు :




ప్రస్థుతము పెట్రోల్, డీజిల్ అమ్మకం ధరలో 50% వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నులే. కేంద్రం రెండుసార్లు పన్ను తగ్గించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎటువంటి పన్ను రాయితీ ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు పెరుగుటకు పెట్రోలు, డీజిల్ ధరలు కూడ ఒక కారణము.

## 6. రైతు బంధు పది ఎకరాలలోపు రైతులకు మాత్రమే ఇవ్వాలి. అలాగే కౌలు రైతులకు కూడ రైతు బంధు ఇవ్వాలి :

ప్రస్థుతము పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న భూమి ఆధారంగా యజమానికి రైతుబంధు పైకం అతని ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. చిన్న, సన్నకారు మరియు మధ్యతరగతి రైతులకు మాత్రమే (అంటే 10 ఎకరాలకు మించకుండా) రైతుబంధు వర్తింపచేయాలి. అలాగే భూయజమాని కాక, కౌలు రైతు వ్యవసాయము చేస్తుంటే కౌలు రైతుకు మాత్రమే రైతు బంధు వర్తింపచేయాలి. ఇక సాగులో ఉన్న భూమికి రైతుబంధు ఇవ్వాలి. పడావు భూములకు రైతుబంధు ఆపివేయాలి.

## 7. పంటల భీమా :

ప్రకృతి సహకరించి పంటలు సరిగా పండిన రైతుకు ఢోకా లేదు. కాని చాలా సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాలతో రైతు పంట తుడిచి పెట్టుకుపోయి రైతు అప్పుల ఊబిలో దిగిపోవడం కొన్ని సందర్భాలలో ఆత్మహత్యకు పాల్పడడం జరుగుతున్నాయి. కష్టకాలంలో రైతును ఆదుకోవడానికి పంటల భీమా పథకం అమలు చేయాలి.

## 8. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు మూడు బోర్ల వరకు పరిమితి విధించాలి :

ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు కట్టడం జరుగుతుంది. అటువంటి పరిస్థితిలో సన్నకారు మరియు మధ్యతరగతి రైతులకు మూడు బోర్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలి. అంతకు మించిన వాటికి ఛార్జీలు వేయాలి. కరెంటుతో అవసనరమున్నా లేకున్నా భూగర్భజలాల వాడకం ఎక్కువగా జరిగి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.

## 9. రైతులకు నాణ్యమైన విత్తన సరఫరా :

నకిలీ విత్తనాలతో రైతులు చాలా నష్టపోతున్నారు. రాష్ట్రంలో విత్తన సర్టిఫికెట్ సంస్థ పనిచేయుచున్నా వారు నకిలీ విత్తనాల అమ్మకంపై సరియైన నియంత్రణ చేయకపోవడంతో చాలా ప్రదేశాలలో నకిలీ విత్తనాల అమ్మకం జరుగుతుంది. బజారులో నకిలీ విత్తనాల అమ్మకంపై గట్టి నిఘా పెట్టాలి. అలాగే నకిలీ విత్తనాలు అమ్మినా, అట్టి విత్తనాలు తయారుచేసిన వారిపై గట్టి చర్యలు తీసుకోవాలి.

## 10. నూనె గింజలు మరియు చిరుధాన్యాల సాగుకై తగిన ప్రోత్సాహం ఇవ్వాలి :

రాష్ట్రంలో 50 శాతానికి మించి భూమిలో వరి పండిస్తున్నారు. వరి అధికసాగుతో నీరు ఎక్కువగా వాడటమే కాక, ధాన్యం అమ్మకంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అనువైన స్థలాలలో వరికి బదులుగా, నూనె గింజలు, చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రోత్సాహమివ్వాలి. రైతులకు సబ్సిడీ మరియు మద్దతు ధర ఇవ్వాలి.

## 11. రాష్ట్రం ఏర్పడిన తరువాత కట్టిన నీటి పారుదల ప్రాజెక్టులపై ఒక ఉన్నత సాంకేతిక కమిటీ ద్వార విచారణ జరిపించాలి :




గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి పెద్ద ఎత్తున కేటాయింపులు జరిగి మెగా ప్రాజెక్టులు చేపట్టినారు. కొందరు ఈ ప్రాజెక్టులు తెలంగాణకు వరదాయిని అంటే, ఇంకా కొందరు సాంకేతికంగా సరియైన పద్ధతిలో పని కాలేదని, విపరీతమైన అవినీతి జరిగిందని రకరకాల ఆరోపణలతో జనాలలో అనుమానాలు ఏర్పడుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్మించిన అన్ని సాగునీటి ప్రాజెక్టులపై ఒక ఉన్నత సాంకేతిక కమిటీని వేసి ప్రజలకు కలిగిన అనుమానాలు దూరం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 12. రాష్ట్రంలో విద్యుత్ కంపెనీల పనితీరుపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలి :

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్ర అవసరాలలో 50% విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అయ్యేది. దీనిపై ప్రభుత్వం పెద్ద ఎత్తున బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. ఇంతవరకు సుమారు 60 వేల కోట్లు ఖర్చుచేసినా మనకు కావలసిన విద్యుత్తు ఉత్పత్తి చేసుకోలేక అధిక ధరలు పెట్టి పక్కరాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. భద్రాద్రి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం అనుకున్న సమయంలో పూర్తి కాలేదు. ఇక యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు సరిగా జరుగక వెనుకబడిపోయి నిర్మాణ ఖర్చు రెండింతలైంది. విద్యుత్ పంపిణీ సంస్థ 60 కోట్ల రూపాయిల అప్పులతో సతమతమవుతుంది. ప్రభుత్వం ప్రజలకు అన్ని విషయాలను తెలుపుతూ ఒక శ్వేత పత్రం విడుదల చేయాలి.

## 13. ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి :

ప్రజాస్వామ్యం పరిడవిల్లాలంటే పాలనలో పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలి. వివేకమంతులైన ప్రజలు ప్రజాస్వామ్యానికి పరిరక్షణ. ప్రభుత్వం ఇచ్చే జి.ఓ.లను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలి. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలి.

## 14. పాలనలో అవినీతికి అడ్డుకట్ట :



ప్రస్తుతం ఏ ప్రభుత్వ కార్యాలయంలో పని ఉన్నా లంచం ఇవ్వనిదే పని జరగడంలేదు. ముఖ్యంగా మునిసిపల్ మరియు రెవెన్యూ వంటి శాఖలలో విపరీతమైన అవినీతి జరుగుతుంది. చట్టబద్ధంగా అందవలసిన సేవలకు కూడ సంబంధిత ఉద్యోగులకు లంచం ఇవ్వనిదే పనులు కావడం లేదు. అవినీతి నిరోధక శాఖ పట్టుకున్న కేసులు సంవత్సరాల తరబడి సచివాలయంలో పెండింగులో ఉండి చివరకు దోషులు తప్పించుకుంటున్నారు. అవినీతికి సంబంధించిన అన్ని కేసులు మూడు సంవత్సరాలలో ముగింపు కావాలి. అవినీతికి ఆస్కారం లేకుండా ఉండడానికి మునిసిపల్, రెవెన్యూ వంటి శాఖలలో చట్టాలలో మార్పులు చేయాలి.

## 15. లోకాయుక్త చట్టాన్ని కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా సవరణలు చేయాలి :

ప్రస్థుతం రాష్ట్ర లోకాయుక్తకు సరియైన అధికారాలు లేక రాజకీయ నాయకుల అవినీతిని నియంత్రించలేకపోతుంది. కర్ణాటక రాష్ట్రం మాదిరిగా తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త చట్టాన్ని, శాసనసభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రిపై వచ్చే అభియోగాలను విచారించే అధికారాలు ఇవ్వాలి. దీనికై రాష్ట్ర లోకాయుక్త చట్టంలో సవరణ జరగాలి.

## 16. పాలనలో జరిగే ఖర్చుపై పొదుపు :

ప్రస్థుతము పాలన కొరకు (ఉద్యోగస్థుల మరియు పెన్షనర్ల జీత భత్యాలు వగైరా) సుమారు 60 వేల కోట్ల రూపాయిలు ఖర్చవుతుంది. అలాగే రకరకాల పనుల పేర్లు చెప్పి దుబారా జరుగుతుంది. దుబారా ఖర్చు తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 17. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మంచి సంబంధాలు కలిగి, రాష్ట్రానికి కేంద్ర ప్రాజెక్టు ఎక్కువగా వచ్చేటట్లు చూడాలి :

గత రెండు దశాబ్దాలుగా కొన్ని రాష్ట్రాలు కేంద్రంతో సత్సంబంధాలు లేక రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం కేంద్రంతో మంచి సంబంధాలు పెంచుకొని రాష్ట్రానికి అధికంగా కేంద్ర నిధులు అలాగే ప్రాజెక్టులు మంజూరు చేయించుకోవాలి.

## 18. పాఠశాలలలో, కాలేజీలలో విశ్వవిద్యాలయాలలో ఉన్న ఖాళీలు భర్తీచేయాలి :

చాలా బడులలో అలాగే కాలేజీలలో బోధనా సిబ్బంది లేక పిల్లలకు సరియైన విద్య అందడం లేదు. తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి విద్యా ప్రమాణాలను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 19. ప్రభుత్వ దవాఖానాలలో ఉన్న డాక్టర్లు, నర్సులు మరియు ఇతర సిబ్బంది ఖాళీలన్నింటిలో తగిన సిబ్బందిని నియమించాలి.

## 20. దశల వారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలి :

తెలంగాణ రాష్ట్రం మద్యం సేవనలో దేశంలో మొదటిస్థానంలో ఉంది. మద్యపానంతో ఎన్నో అనర్థాలు ఉన్నా ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని పట్టించుకోకుండా ఇంకా ప్రోత్సహిస్తుంది. 2014 సంవత్సరంలో ఆబ్కారీ శాఖ ద్వార వచ్చే ఆదాయము 8 వేల కోట్ల రూపాయిలు కాగా అది ప్రస్థుతము 40 వేల కోట్ల రూపాయిలు దాటింది (అంటే 500% పెంపు). నేడు తెలంగాణ రాష్ట్రంలో బడులు లేని గ్రామాలు, తండాలు ఉండవచ్చునేమో కాని బెల్టు షాపులు లేని గ్రామాలు కాని తండాలు కాని లేవు. మద్యపానాన్ని దశల వారీగా తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మద్యం దుకాణాలు, బార్లు వంటి వాటిని తగ్గించడం, అలాగే మద్యం ధరలు పెంచడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 21. మాదకద్రవ్యాల అమ్మకం మరియు వాడకం ఉక్కుపాదంతో అణచివేయాలి :



ఈమధ్యకాలంలో మాదకద్రవ్యాల వాడకం తెలంగాణలో బాగా పెరిగింది. 5 సంవత్సరాల క్రితం గోవా వంటి ప్రదేశాల నుంచి మాదకద్రవ్యాలు హైదరాబాదుకు వచ్చేవి. అటువంటిది నేడు హైదరాబాదు నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే పరిస్థితి నెలకొంది. ప్రస్థుతం ప్రభుత్వం చేపట్టిన చర్యలు సరిపోవు.

## 22. రాజకీయనాయకులు వారి మానిఫెస్టోలో చెప్పిన పథకాల కొరకు అయ్యే ఖర్చు తెలుపుతూ, అట్టి డబ్బు ఎచ్చటి నుంచి వస్తుందో తెలపాలి :

అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లను మంచి చేసుకోవడానికి రకరకాల పథకాలను చేస్తామని చెపుతున్నారు. ఇట్టి పథకాల అమలుకు కావలసిన డబ్బు ఎచటి నుంచి వస్తుందో ప్రజలకు తెలపవలసిన అవసరముంది. గొప్పలకు పోయి ఓటర్లను ప్రలోభపెట్టడానికి రాజకీయపార్టీ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచే ప్రమాదముంది.

## 23. సుప్రీమ్‌కోర్టు వారు చెప్పిన విధంగా పోలీసు శాఖలో సంస్కరణలు తీసుకురావాలి :



తమకు అనువైన చోట పోస్టింగు కొరకు అలాగే పదవీ విరమణ తరువాత అడ్వైజర్ వంటి స్థానాల కొరకు ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకుల పంచన చేరడంతో మొత్తం పాలన అంతా రాజకీయనాయకుల చేతుల్లోనికి వెళ్ళింది. చట్టబద్ధ పాలన, చట్టం ముందు అందరూ సమానులే అన్న సంస్కృతిని పక్కన పెట్టి ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీకి విధేయులుగా ఉంటున్నారు. పోలీసుశాఖలో సంస్కరణలు తీసుకురావడానికి సుప్రీమ్ కోర్టు వారు కొన్ని మార్గదర్శకాలు జారీచేసినారు. వాటిలో కొన్ని – రాష్ట్ర భద్రతా కమీషన్ : దీనిలో రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖ పనిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండడం అలాగే పనిపై మార్గదర్శకాలు వంటివి. ఇక ఫిర్యాదుల విచారణ సంస్థ (పోలీసు కంప్లయింట్ అథారిటీ) వీరు పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులను విచారిస్తారు. పోలీసుశాఖ వారు ప్రజలకు అధిక సేవలు అందజేయాలంటే సుప్రీమ్‌కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు రాష్ట్రంలో అమలుచేయాలి.

## 24. ఆహార కల్తీ పై గట్టి నిఘా :



రాష్ట్రంలో ఆహార పదార్థాల కల్తీ విచ్చల విడిగా జరుగుతుంది. కల్తీని నిరోధించడానికి గట్టి చర్యలు గైకొనాలి. ప్రస్తుతము రాష్ట్రములో ఒకే ఒక ఫుడ్ టెస్టింగు లాబరేటరి ఉంది. దీనితో పరీక్షలు చేయడం ఆలస్యమవుతుంది. ఇంకో లాబ్ అధునాతన సాంకేతికతతో నెలకొల్పాలి.

## 25. శాసనసభ్యులు మరియు మంత్రులు, ముఖ్యమంత్రి ప్రతి సంవత్సరం తమ తమ ఆస్థి వివరాలు తెలపాలి :

ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సంవత్సరం తమ ఆస్థి వివరాలు పై అధికారికి లిఖితపూర్వకంగా ఇస్తారు. అదే పద్ధతిలో శాసనసభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రి ప్రతి సంవత్సరము తమ ఆస్థుల వివరాలు సభాపతికి సమర్పించాలి. ఆయన దానిని సభలో ఉంచాలి. అలాగే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలి.

## 26. నదులు, చెరువులను కాలుష్యం కాకుండా కాపాడాలి :

తెలంగాణ రాష్ట్రంలో వాల్టా (వాటర్, ల్యాండ్, ట్రీ )యాక్ట్ ఉన్నను, చెరువులు, నదులు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుంది. నగరం నడిబొడ్డున గల హుస్సేన్‌సాగర్, మూసీనది మరియు ఇతర చిన్న చితక చెరువులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో కలుషిత కాసారాలుగా మారినాయి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కూడ ఏమీ చేయలేని స్థితిలో ఉంది.



## 27. అటవీ సంరక్షణ :

అడవులను ఆక్రమించి, చెట్లను నరికి వ్యవసాయము చేసే పోడు వ్యవసాయానికి స్వస్తి పలకాలి. ఇప్పటివరకే లక్షల ఎకరాల అడవులు నరికి పోడు వ్యవసాయం చేస్తున్నారు. అడవీ హక్కుల చట్టం 2005 వచ్చిన తరువాత కొత్తగా అడవులు ఆక్రమించిన వారిని తొలగించి మరల అచ్చుట స్థానిక గిరిజనులకు లబ్ధిని ఇచ్చే పండ్ల చెట్లను పెంచాలి.

## 28. రాజకీయపార్టీలు 25% టికెట్లు మహిళలకు కేటాయించాలి :

ఈమధ్యనే భారత పార్లమెంటు 33% సీట్లు రాష్ట్ర అసెంబ్లీలో కాని, పార్లమెంటులో కాని మహిళలకు కేటాయించాలని చట్టం తీసుకురావడం జరిగింది. కాని ఈ చట్టం అమలుకు కొంత సమయం పడుతుంది. అప్పటివరకు రాజకీయ పార్టీలు 25% మహిళలకు సీట్లు కేటాయించాలి.



## 29. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికకు సరియైన మార్గదర్శకాలు చేయాలి :

ప్రభుత్వపరంగా అమలు చేసే రకరకాల సంక్షేమ పథకాలలో లబ్ధిదారుల ఎంపిక అధికారపార్టీ శాసనసభ్యుల చేతిలో ఉంది. దానితో అర్హులకు లాభం చేకూరుట లేదు. గ్రామస్థాయిలో గ్రామసభలో అలాగే పట్టణాలలో వార్డు కమిటీల ద్వార లబ్ధిదారుల ఎంపిక జరగాలి. దీనిలో శాసపసభ్యులను దూరంగా ఉంచాలి. పట్టణాలలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లను తమ తమ ప్రాంతాలలో జరిగే పనులలో భాగస్వామ్యులను చేయాలి.

## 30. నేరచరిత్రులకు టికెట్ ఇవ్వకూడదు :

ప్రస్తుతము రాష్ట్ర అసెంబ్లీలో కాని పార్లమెంటులో కాని సుమారు 40% సభ్యులపై నేరచరిత్ర ఉంది. ఈ సమస్య పోను పోను ఇంకా జటిలమై చట్టసభలలో మొత్తము నేరచరిత్రులే కూర్చునే పరిస్థితి రావచ్చు. రాజకీయ పార్టీలు నేరచరిత్రులకు టికెట్లు ఇచ్చినచో దానికి తగిన కారణాలు ప్రజలకు తెలపాలి. అలాగే పత్రికలలో మూడు సార్లు వారి నేరచరిత్ర గురించి తెలపాలి.




## 31. ప్రభుత్వ భూముల అమ్మకంపై నిషేధం :

పేద దేశంలో భూమి అన్నది స్థిరాస్థి. దీనిని జాగ్రత్తగా అవసరాన్ని బట్టి వాడుకోవాలి. జనాభా పెరుగుతున్న కొద్దీ వారి అవసరాలకై అంటే నివాసప్రదేశాలు ఇంకా ఇతర పౌరసేవల కొరకై – బడులు, ఆసుపత్రులు మరియు శ్మశానవాటికల వంటి వాటి కొరకు భూమి అవసరముంటుంది. కాబట్టి ప్రభుత్వ భూములను అమ్మకూడదు.

## 32. ధరలపై నియంత్రణ :

నిత్యావసరాల ధరలు దినదినానికి పెరిగిపోవడంతో సామాన్యులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. సామాన్యుడు వాడే వస్తుఉలపై పన్నులు తగ్గించాలి. ముఖ్యంగా తినుబండారాల ధరలు తగ్గాలి. ధరలను అదుపులో ఉంచాలి.

## 33. నైపుణ్యం పెంపుదల మరియు ఉపాధి :

రాష్ట్రంలో చాలామంది యువత నైపుణ్యము కొరవడి నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. హైదరాబాదు నగరంలో స్కిల్ పనులు చాలా వరకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు.



అలాగే గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళే వారికి ఏదైనా పనిలో నాణ్యత (స్కిల్) ఉన్న ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. చాలామంది పేదలు ఉన్నత విద్య అందుబాటులో లేక బడి మానేసినారు. అటువంటి వారికి స్కిల్ డెవలప్‌మెంటు తర్ఫీదు ఇప్పించిన ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

## 34. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు :



తెలంగాణ రాష్ట్రం నుంచి చాలామంది యువకులు ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారు. కొందరు బాగానే ఉన్నా ఇంకా కొందరు మధ్య దళారుల చేతిలో మోసపోయి జైళ్ళ పాలవుతున్నారు. కొన్ని సందర్భాలలో గల్ఫ్‌లో కార్మికుడు చనిపోయినా కుటుంబాన్ని ఆదుకునే పరిస్థితి లేదు. ఈ సమస్యలను అధిగమించడానికి కేరళ మోడల్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి.

## 35. క్రీడలకు ప్రోత్సాహం :



చిన్న పిల్లలకు మానసిక ఉల్లాసం, అలాగే ఆరోగ్య దృష్ట్యా క్రీడలను ప్రోత్సహించాలి. ఇందుకు తగిన నిధులు కేటాయించాలి.

✦✦✦

● మా ఓటు అమ్మకానికి లేదు

● మా గ్రామానికి మద్యము మరియు డబ్బు సంచులతో రావద్దు.




సుపరిపాలన వేదిక

ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్

ఇంటి నెం. 6-1-69, ఫ్లాట్ నెం.204, జి.కె.ఆర్. మాన్షన్,

సైఫాబాద్, లకిడికాపూల్, హైదరాబాద్-500 004. ఫోన్: 040-2323 0334.